కుటుంబతరంగిణి—౮ *

'సిస్టర్' అంటే సోదరికాదూ?

[కథానిక]

= శ్రీ కవికొండల వెంకటరావు =

'టాక్సీ'-దాన్నే 'ప్లెజర్ కార్' అని మామోలుగా అంటారు-నలుగు రైదుగురు కూర్చునే వైశాల్యం గలదిగా వుంటుంది-అది వచ్చి డాక్టర్ అభినవ మోహన్ గుమ్మంలో గమ్మున ఆగింది. అందులో వెనుక సీటుమీద ఓవారకు ఓసుందరి కూర్చునివుంది. అభినవ మోహన్ యొక్క కాంపౌండరు తన డాక్టర్ గారి 'ఓవర్ సీస్' తోలుపెట్టె, ఇన్ లాండు హోల్డాల్, ఫ్లాస్కు, కూజా ఇలాంటివన్నీ ఆసుందరిప్రక్క కొన్నీ, ముందు పీఠీని కొన్నీ-ఇంటిలోనుంచి తెచ్చి-పొందిగ్గా అమర్చాడు.

అయిదునిమిషాలు అంతా నిశ్శబ్దమయంగా వుండిపోయింది; ప్రకృతీ-పరమాత్మ-సమస్తప్రపంచమూను.

అంతట 'టాక్సీ'లోని సుందరి తన రిస్టుకేసి చూచుకుంటూ "అప్పుడే ఆరైంది. మెయిల్ ఆరుంబావుకు వస్తుంది. డాక్టర్ ! హరీ అప్!" అని కేకేసింది. ఆదాకా చావడిలో టేబిలుమీద పడివున్న హేటును నెత్తిమీద పెట్టుకుంటూ ఆలా ఎదరకు చిరునవ్వు వెనుక్క కన్నీటిచుక్క ఆనేలా తన రెండుకళ్లూ పంచి ఇంటిగుమ్మం మెట్లు దిగి—హేట్ కారు లోపలి సుందరి కందిస్తూ తాను డ్రైవరుండే సీటులో ఆసీనుడై, కారుకు సాగుదలగొల్పి, వేగ మెంత ఇవ్వవచ్చునో అంత వేగం రస్తామీద పూరాగా ఇచ్చుకుంటూ తన గృహలక్ష్మి కళ్లనుండి తిరోహితుడైనాడు అభినవమోహన్ !

---

* లోగడ భారతిలో ఈ శీర్షికను అప్పటప్పట ఆరున్నొకటి ముద్రితములైనాయి.

అభినవమోహన్ గృహలక్ష్మిపేరు "సౌభాగ్యవతి చందనచర్చ." సౌభాగ్యవతి అన్నది ఆమెకు తల్లిదండ్రులు నామకరణ మహోత్సవంనాడే పేరుతో కలిపి ఏకంగా వ్రాసేశారు.

భర్త తన చూపులకు దూరమైనకొద్దీ దీర్ఘతర దీర్ఘతరములైన కన్నీటిధారలు పయటమీదకు పడనిచ్చుకుంటూ, తన చూపులకు అంతా అయోమయంగా తోచేలా మనస్సును వదిలేసి, కాంపౌండరుతో "మనకు త్తరం వారినుండి వారంవారం తప్పకుండా వస్తుందనుకుంటాను." అంది. కాంపౌండరు "మనకు వచ్చినా రాకపోయినా ఆమెకు వస్తుందమ్మా!" అన్నాడు.

"ఆమె ?"

కాంపౌండరు—"ఆమే. హాస్పిటాల్ నర్సు!"

చందనచర్చ—"నర్సంటే?"

కాంపౌండరు— "నర్స అంటే నర్సే-ఏమని చెప్పను? నేను మన హానరరీ డాక్టరుగారికి నాట్ పెయిడ్ కాంపౌండర్ని ఏలాగయ్యానో ఆమె గవర్నమెంటుహాస్పిటాలుకు ఆలా పెయిడ్ నర్సు అయింది తల్లీ!" అన్నాడు. ఆనిమిషమప్పుడు చందనచర్చ ఆ కాంపౌండరు గావించిన నిర్వచనం ఔను అనక, కాదు అనక, అందలి అధిక్షేపం ఉల్లికుట్టు తనకు తెలిసినట్టూ కనపడక, తెలియనట్టూ కనపడక "ఆలా అయితే మధ్యమధ్య ఆమెను కనుక్కుంటూవుండు అయ్యగారి యోగక్షేమాన్ని గురించి. కనుక్కుని నాకు చెబుతూవుండు. చాలా ఖరీదైన చీర కట్టిందే ఆమె?" అంది. "ఆమె

కేం తల్లీ! నెలకు డెబ్భై రూపాయలు జీతం! పిల్లా జెల్లా? మగడా మగపురుగా?—వచ్చినజీతం వాళ్లలా చీరలమీద గోరలమీద, గాజులమీద జాజులమీద పెట్టి—" చందనచర్చ "మరీ చదవక్కరలేదు! వాల కమే తెలుస్తూంది! నీవు వెళ్లు" అంది.

ఆవెంటనే కాంపౌండరు యజమానురాలినుండి సెలవుతీసికొని నిష్క్రమించాడు. ఆమె—ఆయిల్లాలు చావడిలోని స్విచ్ ఆన్‌చేసి విద్యుద్దీపపు వెలుగులో భర్తకుర్చీమీద కూర్చున్నదై ఆలా టేబిల్‌మీదకు తలవంచుకొని ఏదో ఊహావ్యథను పడిపోయింది; పది నిమిషాలుగా గడియారపుముల్లు తిరిగి అరగంట కొట్టినా ఆమె తలెత్తి వీథివంకకుగాని, పడమటింటి వెంపుగ్గాని చూడలేదు.

చందనచర్చతల్లి తాయారమ్మ లోపట్నుంచి వచ్చి స్విచ్ ఆఫ్‌చేసి వీథితలుపు గెడవేసి కూతుర్ని వంటింటి వెలుగు సాహాయ్యాన్నే నవరించినట్టు నవరిస్తూ, "ఇంతలోకే ఇంత ఇలా అయితే ఏలాగనే అమ్మా! ఈ పైని నెలనెలా తెచ్చే వెయ్యి రూపాయలూ ఎవరివళ్లో పోస్తాడే? నీవళ్లోనే పోస్తాడు! ఈ వళ్లోనే పోస్తాడు! రా తల్లీ! నడవలోకి వచ్చి కూర్చో!" అంది. కూతురు లేస్తూ "నా కాయన మంగళసూత్రం కట్టినప్పుడు ఆయన నెలకు. వెయ్యి రూపాయలు తీసుగొచ్చి నావొళ్లో పోయాలని నీవు మాట్లాడుకున్నావా? అని అడిగింది. తాయారమ్మ "మాట్లాడుకోవడ మేమిటి? యుద్ధం వచ్చిపడ్డట్టే ఈ ఉద్యోగాలూ వచ్చి పడ్డాయి. ఉద్యోగాల్తోపాటు పెద్దజీతాలూ వచ్చిపడుతున్నాయి. మాట్లాడుకోవడం ఏమిటే నీమొహం! మాట్లాడుకుంటేమాత్రం డబ్బన్నది వచ్చిపడుతుందే? పిచ్చిదానా! ఎన్నాళ్లిక్కడ ఆడిపుండు పిండి ఊడిపుండు కోసి సంపాదించను నెలకు వెయ్యిరూపాయలు?నన్నడిగితే నా అల్లుడు మంచిపని చేశాడని చెప్తాను." అంది. చందనచర్చ "పుండు పిండడమేమిటే, కురుపుకొయ్యడ మేమిటే- పాడుమాటలు" అంది.

"డాక్టర్లు చేసే పని చెప్పాను."

"డాక్టర్లు చేసేది సేవ!"

"ఆ సేవే ఇప్పుడు దర్జాగా చేస్తారు."

"ఎక్కడ చేస్తారంటావ్?"

"అది నాకు మాత్రం తెలుసా?"

"తెలియనప్పుడు అధికప్రసంగం కట్టిపెట్టు! యుద్ధభూమిలో చెయ్యాలట సేవ! బాంబుల వర్షం పైనుండి కురుస్తూవుంటే కిందను సోల్జర్లకు సూదిమందులు గ్రుచ్చుతూవుండాలిట నీ అల్లుడు!"

"ఆఁఆఁ! అంత అన్యాయం వుంటుందా? అంత అపకారం జరుగుతుందా?" అంటూ తాయారమ్మ బిగ్గరగా బొబ్బ పెట్టింది.

ఆపాళంగా కూతురు తన తల్లి నోరు నొక్కి "కేకలు పెట్టి గోల చెయ్యకు- మన కేమీ తెలియదు" అంది.

"మనకు తెలియకపోతే కాంపౌండరుకూ తెలియదూ?"

"కాంపౌండరుకూ తెలియదు."

"మరెవరికి తెలుస్తుంది?"

"ఆకార్లో కూర్చునివుంది చూశావు! ఆ నర్సుకు గానీ తెలియాలి."

"అవితే రేపు ఆమెనే కనుక్కొంటాను ఈ ఉద్యోగం యొక్క ఆనుపాను.—అమ్మయొయ్యో! పైని బాంబులవర్షం కురుస్తూవుంటే కింద సోల్జర్లకు సూదులు పొడుస్తూ వాళ్లతోపాటు వీళ్లూ పరంపడించటమే! ఆలాంటి సంగతి మొదట్లో నీ మొగుడు చెప్పివుంటే కాళ్లమీద పడి మానిపించివుండకపొయ్యేదాన్నా?-రేపు నర్సిచే టెలిగ్రాం ఇప్పించి వెనక్కు రప్పించే సూత్రం గావిస్తాను.— ఈవేళకు వెంకటేశ్వరుడికి మొక్కుకో" అంటూ తాయారమ్మ తన కూతుర్ని ఆలాఆలా వంటింట్లోకి కంచంముందుకు నడిపించుకుని వెళ్లి నాలుగు మెతుకులు కక్కరించేలా చేసి నిదుర బుచ్చింది. ఆరాత్రి ఏలాగో తెల్లారింది.

కాని మర్నాడు కాంపౌండర్ని వాకబు చేస్తే –"ఆనర్సుకు 'పట్నం' బదిలీ అయిపోయింది" అని తాయారమ్మకు తెలియవచ్చింది. — తాయారమ్మకు

గాని, ఆమె కూతురికి గాని మరేమీ తట్టనూలేదు, తెలుపుడుగానూ లేదు.

* * *

ఇక్కడ-పాఠకులు—ఇది కథలో ఒక లెక్చరు అనుకున్నా, లేక కథకు సంబంధించని నాలుగుముక్క లనుకున్నా సరే- కొంచెం విడబఱచి ఏదో వెళ్లబుచ్చ దలచుకున్నాను– వినండి– మనలో మగవాళ్లు అని అనుకొనే మగవాళ్లకు గాని, ఆడవాళ్లు అని అనుకొనే ఆడవాళ్లకు గాని ఏవొక్క సంగతి, ఏవొక్క వుద్యోగంయొక్క సరియైన నిర్వహణము, సరియైనజవాబుదారీ తెలియదు అనే నావూహ. మఱేన్నీ మనకు ఎన్ని కళ్లు వున్నా ఇంతే! ఎంచేతా అంటే తగిన పరిజ్ఞానం ఏదీ మనకు? మగవాళ్లకూ లేదు, ఆడవాళ్లకూ లేదు. ఏదో నెల అయ్యేసరికి ఇన్నిరూపాయలు మగడు తెస్తున్నా డని పెళ్లానికి బులుపు; పెళ్లాం ఏదో వేపుడుకూర వేయింపించి యింత వణ్ణం విస్తట్లోకి వడ్డింపిస్తూవుం దని మగనికి మహోత్సాహం - ఆరెండూ తప్పిస్తే వాళ్లవాళ్ల నిర్వాహకాలు ఏమిటవి? అన్యోన్యం అర్థం చేసికొనేవి ఏమున్నాయో చూపించండి! ఎంతమంది వుద్యోగస్థుల భార్యలు తమభర్తలు వుద్యోగపుగద్దెమీదున్నపుడు చూచినవారున్నారు? వారెలాంటి దిరీసులో వుంటారో, ఏలా కాసర బీసర మాట్లాడుకుంటూ వుంటారో, ఎలాంటి హొయలు పోతారో, ఎంతెంత హుముులు కాపరుస్తూ ఊరక లేస్తారో ఇవన్నీ కనుగొన్న సహచరిణులు ఎంత మంది వున్నారు? అణాపైసలు సమేతంగా భర్తజీతం భార్య అలా ఆకర్షించుకు తీసికొనివుండొచ్చును గాని, వాని పని ఈమె అర్థంచేసికొన్నది వుందా? అలాగ్గానే స్త్రీమానసం, స్త్రీయొక్క కృషి వెయ్యేళ్లు తల్లక్రిందులుపడ్డా మగవాని కర్థంగాబోని అడుగు మెట్టున మన నాగరీకత నేడుంది అని నాఅభిప్రాయం. ఇతడు తార్రోడ్డుమీద గుఱ్ఱమెక్కి టకటకా రైడ్ చేస్తూవుంటే ఆమె మేడమీద ఎంతెంత ఎత్తు ఊహా సౌధాలు కట్టుకుంటూవుంటుందో ఎవడి కెఱుక?

ఈ అభిప్రాయాలూ, ఈవుపన్యాసాలూ ఇలా వుంటూవుండగానే 'విసూవియస్' అగ్నిపర్వతం మూడు సార్లు అప్పుడే బద్దలై 'లావా' వెళ్లగ్రక్కింది. ప్రపంచ యుద్ధం ఒకసారి చెలరేగి, ఆగి, మళ్లీ భేరీమ్రోగిస్తూ వుంది. క్వెట్టాభూకంపం, బీహారుభూకంపం, టర్కీ భూకంపం - వీటితో ఆదిశేషుని వేయితలలో - రెండు బుజాలో - కాయలుకాసిపోయినాయి. మఱి కథలోని 'చందనచర్చ'కు కొత్తరకపు మలేరియా జ్వరం ఏడాదిలో ఇరవైసార్లు రాకతప్పింది కాదు. ఆవ్యాధి ఆమెను ఊపి ఊచముట్టుగా పీల్చి పిప్పిచేసి తుదకు ఊపిరితిత్తుల్ని తప్పచేసి 'ఎందుకూ పనికిరాని ఆడది ఈమె' అని నలుగురూ అనుకొనేలా కనబఱచి విడిచిపెట్టింది. అందఱూ "ఎటువంటి చందనచర్చ ఏలా అయిపోయింది అంటే ఏలాఅయిపోయింది" అని అనుకోవడమే. అవన్నీ లోకప్రళయాలుకాబట్టి వార్తా పత్రికల్లో ప్రకటింపబడ్డాయి. ఈమెవ్యాధి వ్యక్తిగత ప్రళయం అవడంచేత నేను మిమ్మల్ని ప్రత్యేకతః విన మనవలసివచ్చింది.

ఇంతకుముం దెప్పుడూ మీ కామెఅందం వర్ణించలే దనుకుంటాను. మిక్కిలీ అందమైన జవరాలు. ఆవిడ ఫొటోతీయించుకున్న సమయమప్పు డాదాకా ఏఫొటోగ్రాఫరుచేతా ఎన్నడూ 'రెడీ' అని అనిపించు కొరుగదు. ఏ 'సిట్టింగు'కుముందూ సవరించుకొరుగదు. మఱెప్పు డెవర్ని ఏమిటంటే ఏంకార్యం?

తల్లి తాయారమ్మ కేమీ పాలుపోక 'పట్నం' లో 'బంగారుహాస్పిటాల్'కు– దాన్నే ఇంగ్లీషులో 'Golden Hospital' అంటారు–తీసుకువెళ్లి గొప్ప వెజ్జుచే వైద్యంచేయిస్తే మెఱుగని, 'ఎక్సురే' పరీక్ష గావింపిస్తే మంచిదని వీరి సలహామీదా, వారి సలహా మీదా వోనిర్ధారణకొచ్చి ప్రయాణంకట్టింది. ఎట్టకేలకు 'పట్నం'చేరుకున్నారు తల్లీకూతుళ్లు.

'పట్నం' అంటే చెన్నపట్నం అని అను కునేరు కనుక. 'పట్నం' అంటే కాశీపట్నం అని అనుకునేరుకనుక. అయినా ఆలోచించండి!—అంటే వింటే బెంగుళూరును పోలీది అని అనవచ్చునేమో. బెంగుళూరు పద్దెనిమిదిక్రాసులు, ఓ సంపెంగరోడ్డు, ఓ మర్గోసారోడ్డు గల పట్నమటగా? ఈపట్నానకూ పద్దెనిమిది క్రాసులూ, రెండు రోడ్లూ వున్నాయి

తేడా - రోడ్ల పేర్లల్లో కించిత్తూ, ఆకారంలో క్వచిత్తూ. దీని రోడ్లు రెండూ అర్ధచంద్రాకారపు వలయరేఖలుగా పట్నపు పొలిమేరమ్మలే రూపొందాల్చి కౌగిలింతవాటంగా ఏకమైయుంటాయి. ఆవలయంలోనే పద్దెనిమిది క్రాసులూను. మఱెన్ని పార్కులు చెప్పలేనన్ని - కేళాకేళీలు వల్లమాల్నన్నీ. వాటి ఎగురుపాటులు, పొగ్రంగులు, అచ్చటి పైలాపచ్చీసు జనం అన్యోన్యం సుఖానుభూతిని గొల్పుకునే వేళాకోళాలకు ఉర్జీలా అన్నట్టు కాపడతాయి.

ఈలా పార్కులు, కేళాకూళీలు, హేఫ్ హేఫ్ కలిసిన ఏక్ రింగురోడ్డు, పద్దెనిమిది నిండు అడ్డరోడ్లూ వున్న ఆ మహాపట్నంలో మన 'హాస్పిటాల్' అమృతసర్ 'గోల్డెన్ టెంపిల్' లాంటి విశేషణం వహించడమేకాకుండా పవిత్రత కల్గివుండడంకూడా చెప్పుకోతగ్గ విశేషం!

తెల్లవాఱగట్ల అయిదుగంటల కోగంట మోగుతుంది. బిగ్ బెన్ ఎలార్మ్ కాదు. గుండెల్లోంచి ఊలకొడుతూ పైకవుతూన్నట్టుగా అవుతుంది ఆధ్వని గణగణమంటా!—ఎక్కడున్న దాదులు, వైద్యులు, స్వీపర్లు, గేట్ కీపర్లు, రోగచికిత్సకూ, శస్త్రచికిత్సకూ తయారయ్యే 'పేషంట్సూ' అందఱూ మేలుకొని కల్యకృత్యాలు దీర్చుకొని కాఫీ మున్నైనవి సేవించి, వలసిన దిరీసులు ధరించుకు ఎనిమిది అయ్యేసరికి హాస్పిటాల్ ఆవరణలో కలకల్లాడుతూ కనిపిస్తారు.— ముఖ్యంగా దాదులున్నారే వాండ్రు మొలల్ని తెల్లటి గౌనుల్తో, తలల్ని తెల్లటిగూడల్తో చెల్లో నడాడే తెల్లతామరపుష్పాల్లా శోభిస్తూ వుంటారు— అక్కడ వొకళ్లు, ఇక్కడ వొకళ్లు ఎక్కడ మాచినా వాళ్లే అని అనుకొనేలా.

చందనచర్చ ఓ రిక్షాలో కూర్చుని హాస్పిటాల్ మెయిన్ గేటు దాటి ఔట్ పేషంట్సు వైపునకు తిరిగే అంతలో ఓ దాది కనిపించి "గుడ్ మార్నింగు. ఈలా వచ్చారేంటమ్మా! మీరు? అంత అలా చిక్కిపోయారేంటమ్మ మీరు!"అంది. చందనచర్చ "ఊపిరితిత్తులు నావి పాడయ్యాయి అన్నారు మావూరిడాక్టర్లు"అంది. "ఊపిరితిత్తులు? లంగ్సు?" అని ఒకింత అభినయించి "అయితే యిటురండి! నేనే అక్కడ వుండే నర్సును. ఏయ్ రిక్షావాలా! అలా పోనిచ్చి రిక్షా అక్కడ ఆపి ఆమెను జాగ్రత్తగా దింపి ఆవరాండాలో బల్లమీద కూర్చోపెట్టు. ఐ కమ్ ఇన్ ఎ మినిట్" అంది నర్సు. నర్సు అన్నా, దాది అన్నా వొక్కర్తే. ఇద్దరు అని అనుకునేరుగనుక పాఠకులు. ప్రతీనర్సుకూ ట్రెమెండస్ డ్యూటీ, ఉపద్రవమైన బాధ్యతా అనుకోండి రోగుల పట్ల.

ఊపిరితిత్తుల్లో జబ్బు అనగానే ఆదోశాఖ. అక్కడ పరీక్షచేసే డాక్టర్ వేఱు. అతని సాధనసంపత్తి వేఱు. అసలు అతని కాంతికలాపమే వేఱు. తెనుగున ఏమంటారో—ఇంగ్లీషున ఆ పరిశోధన 'ఎక్సురే ఎక్జామినేషన్' అని పిలవబడుతుంది.

పరిశోధనాగారంలోకి చందనచర్చ జాగ్రత్తగా నర్సుచేత నడిపింపబడింది.—ఈపాటికప్పుడే పాఠకులకు అవగాహనై వుండాలి. —కాకపోతే చెప్తావున్నాను. నర్సును చందనచర్చ పోల్చగలిగింది; చందనచర్చను నర్సు పోల్చగలిగింది - ఆనాడు టాక్సీలోని నర్సని; ఆనాటి గుమ్మంలోని గృహలక్ష్మి అని.

చందనచర్చ పేరు వున్న కాగితము నర్సు టి.బి. బాస్ ముందు పెట్టి "ఈమెయే చందనచర్చ" అంది. గది అంతా మెయిల్ ఇంజన్ గనుక రాత్రివేళ లైన్ మీద లైట్ ఫోకస్ చేసుకున్నట్లు తెల్లటి విద్యుత్కాంతి నిండించుకు వుంది. కాగితంమీది డయాగ్రంవంక ఒకసారి, మనిషివంక ఒకసారి చూచేలో ఫోకస్ అయియున్న లైటు- ఒక గంట మోగి చట్న హూఫ్ అని వూది ఆర్పినట్టు ఆఫ్అయి వెంటనే ఏదో చిరువెల్గు అతి సున్నితపు టూదాశోభతో చందనచర్చగుండా పరిశీలించే డాక్టర్ కళ్లమీదకు, డాక్టరు వెన్నునే పొంచుండి గమనిస్తూవున్న నర్సుకళ్లమీదకు ప్రసరించినట్టయింది.

పరిశోధన నిజంగా చేస్తే ఎంతోసేపు పట్టదు. అది ఫొటోతియ్యడం కాదు. తెరమీద బొమ్మ ఆనించడం. స్క్రీనింగ్. అంతా ఓనిమేషం. అనిమేషం పూర్తి కాకుండానే గదితలుపుతట్టినట్టయింది. నర్సు తలుపువద్ద

కువెళ్లి ఎవరాఅన్నట్టు 'కీహోల్'లోకి చెవియొగ్గింది. "మిస్టర్! దయచేసి తలుపు తెరవండి" అన్నట్టు వినబడింది. నర్సు తలుపు తీస్తూ "ఏమన్నారు నన్ను?" అని అడిగింది. అవతల వ్యక్తి "సారీ! సిస్టర్!" అంటూ గదిలోకి చొరబడి తనుకూడా ఆకోమల శ్యామలకిరణ మార్గంలోనే నిలబడిపోయాడు. నర్సు తిరిగి తలుపు నొక్కేసింది. అంతా ఎంతలో? ఒక పావునిమిషంలో.

చందనచర్చ ఆ కొత్తపురుషుని చూస్తూ సిగ్గుపడి యొత్తిగిల్లి హాస్పిటాల్ డాక్టరుతో "ఇఖ నన్ను పరీక్ష చేయ నఖ్ఖరలేదండీ! నేను ఆరోగ్యంగానే వున్నాను" అంది. హాస్పిటాల్ డాక్టరుకు అదంతా గ్రీక్ అండ్ లాటిన్‌గా వుంది. ఆయన తక్షణం రూమంతా పగటి వెలుగ్గా తలుపులన్నీ బార్లెట్టించి "ఏమిటిది, ఈమె ఇలా అంటుంది?" అంటూ నర్సు వంక చూస్తూ, "హల్లో మేజర్! ఎప్పుడు రాక?" అని క్రొత్తపురుషుని కుశలప్రశ్న వేశాడు, నఖశిఖ పర్యంతం అతని ఐ. ఎమ్. ఎస్. దిరీసు గమనిస్తూ.

అప్పటికప్పుడే "సిస్టర్ అంటే సోదరికాదూ? సోదరి కాదూ? నాకు మరి రోగంలేదు. నా వూపిరి తిత్తులు సరిగ్గానే వున్నాయి. నన్ను కొంచెం విశ్రాంతి తీసికోనివ్వండి" అంటూ ఆగదిలోనే ఓమున్నని నిగనిగలాడే సోగసైన అతిసుకుమారపు కుర్చీమీద నర్సు సాహాయ్యాన్ని కూర్చుంది చందనచర్చ. సమీపంలో ఓ ఫాన్ ఆన్‌చేశా రెవ్వరో!

నర్సు—"టెలిఫోనులో ఆమెభర్త అయిన ఈయనగారికి ఈమెను గురించి నేటి వుదయం తెలియ జేశాను."

మేజర్ అభినవమోహన్—"నేనున్నా నిన్న రాత్రే వచ్చాను ట్రూప్ ట్రెయిన్లో."

హాస్పిటాల్ డాక్టర్—"నీయిల్లాలి ఊపిరి తిత్తుల్లో ఎట్టి జబ్బున్నూ లేదు."

చందనచర్చయొక్క అలకలు అతి కులాసాగా, వీవనకు వడి అందుకున్నకొద్దీ మెలిమెలిగా అల్లల్లాడుతూ నుదుటిమీది తిలకాన్ని దోబూచులాడించాయి!